ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట్ 7వ డివిజన్‌లోని రెడ్డీస్ ఎవెన్యూ 2సీలో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రణయ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఎవెన్యూ 1ఏ, 2బీ, 1సీలలోని డ్రైనేజీ సమస్యను స్థానికులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ అరుణ్, రెడ్డీస్ ఎవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురునాథ్, జనరల్ సెక్రెటరీ చుక్క సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ధనంజయ్, ట్రెజరర్ మురళి, జగన్ మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రదీప్ వర్మకు కిషన్‌రెడ్డి నివాళి

నిజాంపేట్: ప్రదీప్ వర్మ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బాచుపల్లి హిల్‌కౌంటీకి చెందిన బీజేపీ అభిమాని, పొలిటికల్ సర్వే సంస్థ అధినేత ప్రదీప్ వర్మ అకాల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం హిల్‌కౌంటీలోని ఆయన కుటుంబ సభ్యులను కిషన్‌రెడ్డి పరామర్శించారు. ప్రదీప్ వర్మ చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ప్రదీప్ వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆర్థికసాయం



ఎమ్మెల్యే వివేకానంద్ ఆర్థిక సహాయాన్ని చిన్నారి కుటుంబానికి అందజేస్తున్న కార్పొరేటర్ జ్యోతి

నిజాంపేట్: కుక్కకాటుకు గురైన చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే వివేకానంద్ ఆర్థిక సహాయం అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ భండారి లేఅవుట్‌కు చెందిన శ్రీకాంత్, నాగసాయి దంపతుల కుమార్తె సోమశ్రీ(03) డిసెంబర్2023లో కుక్క కాటుబారిన పడి ఆస్పత్రిలో పొందింది. అప్పట్లో చిన్నారి వైద్య ఖర్చులను రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శాసనసభ ఎన్నికలు, అపై లోక్‌సభ ఎన్నికల కారణంగ వీలుకాకపోవడంతో తాజాగా శనివారం స్థానిక కార్పొరేటర్ జ్యోతి చేతుల మీదుగా రూ.25 వేల నగదును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

‘వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి’కి ఐఎస్‌వో గుర్తింపు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ ఐఎస్‌ఓ 21001:2018 గుర్తింపు లభించింది. పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు అనుకూల అభ్యాస, బోధనా పద్ధతులు, వనరులు, వసతులు విద్యాసంస్థలో ఉన్నట్లుగా నిర్ధారిస్తున్నట్టు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌ను అందజేస్తారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కళాశాలలో చేసిన అభివృద్ధి, అధ్యాపకుల కృషి ఫలితంగానే ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ లభించిందని అన్నారు. కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలోనూ తమ కళాశాల ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ చెన్నకేశవరావు, డాక్టర్ చంద్రమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌తో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సీడీ నాయుడు



అవార్డులతో ఎంఎల్‌ఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, విద్యార్థులు

ఎంఎల్‌ఆర్‌ఐటీకి అవార్డులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఎంఎల్‌ఆర్‌ఐటీ) వివిధ విభాగాల్లో అవార్డులు దక్కించుకుంది. శనివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే.శ్రీనివాసరావు, సీఎస్‌ఈ విద్యార్థి దివ్యశ్రీకు బెస్ట్ ఔట్‌రీజ్, అజ్మీర కిరణ్‌కు బెస్ట్ యంగ్ రీసెర్చర్, చిన్న స్వామికి బెస్ట్‌ఇన్నోవేటివ్ రిసెర్చర్, విద్యకు బెస్ట్ సపోర్టింగ్ స్టూడెంట్ అవార్డులు రాగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ శైలజ రామయ్యార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు దక్కడంపై ఎంఎల్‌ఆర్‌ఐటీ ఫౌండర్ సెక్రటరీ, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలను పరిష్కరిస్తా

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ శనివారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీ సమస్యల గురించి నియోజవర్గం బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి వివరించారు. మార్కెట్ రోడ్డు, పార్కింగ్ సమస్యలను వివరించారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు టి.వేణు, సోషల్ మీడియా సంతోష్‌కుమార్, భరత్‌నగర్ అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్, సీనియర్ నాయకులు టి.సంతోష్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.



భరత్‌నగర్ కాలనీలో పాదయాత్ర చేసిన రమేష్

నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి..!

చింతల్: నేరాల నియంత్రణలో ప్రముఖ పాత్ర పోషించే నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. వాటిని ఏర్పాటు చేసిన రోజు చేసిన హడావిడి మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. సంక్షేమ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, నేర పరిశోధనలు పనిచేసే అధికారులు, పోలీసు వ్యవస్థలో పనిచేసే అధికారులు వాటిని ఏర్పాటు చేసేటప్పుడు చూపే శ్రద్ధ కొన్ని రోజుల తర్వాత వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో కెమెరాలపై నిర్లక్ష్య మేఘాలు కమ్ముకున్నాయి. చింతల్ డివిజన్‌లోని భగత్ సింగ్‌నగర్, చింతల్, చంద్రనగర్‌లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పలుచోట్ల వైర్లు కట్ కావడం, మరికొన్ని కెమెరాల కనెక్షన్లను ఆకతాయిలు తొలగించారు.



భగత్‌సింగ్‌నగర్ రోడ్డులో వైరు తెగిపోయిన సీసీ కెమెరా



భగత్‌సింగ్‌నగర్ హనుమాన్ ఆలయ వీధిలో ..



చింతల్‌లో అడ్డం తిరిగిన సీసీ కెమెరా..



చంద్రానగర్‌లో నేల చూపులు చూస్తున్న సీసీ కెమెరా



షాపూర్‌నగర్ వాటర్‌వర్క్స్ పంప్ హౌస్ వద్ద..



షాపూర్‌నగర్- చింతల్ రోడ్డులోని హెచ్‌ఎంటీ కంపెనీ సమీపంలో..



జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో..



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాకు సమీపంలో ..

మోడుబారి.. ప్రమాదకరంగా మారి..

రంగారెడ్డినగర్: ప్రధాన రహదారుల వెంబడి మోడుబారిన చెట్లు ప్రమాదకరంగా మారాయి. అసలే వానాకాలం. ఈ నేపథ్యంలో ఆ చెట్లు ఎప్పుడు కూలి, ఎవరి మీద పడతాయో తెలియని పరిస్థితి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని చింతల్- షాపూర్‌నగర్ రహదారిలోని హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశానికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో ఎండిన చెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. షాపూర్‌నగర్- గాజులరామారం రోడ్డులో సైతం మోడుబారిన వృక్షాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈదురుగాలులతో వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎండిన వృక్షాలు కూలే ప్రమాదముంది.



షాపూర్‌నగర్- గాజులరామారం రోడ్డులో..

నిరుద్యోగి మోతీలాల్ ఆరోగ్యాన్ని కాపాడాలి



ఆసుపత్రిలో మోతీలాల్‌ను పరామర్శించిన కుమార్‌యాదవ్

అల్విన్‌కాలనీ: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోతీలాల్ నాయక్ అనే నిరుద్యోగి గత వారం రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆరోగ్యం క్షీణించి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం మోతీలాల్‌ను బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం దీక్షలు చేస్తుంటే రాష్ట్ర మంత్రులు మాత్రం సినిమాలు చూస్తూ కాలయాపన చేయటం దుర్మార్గమన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీ హాలులో ఈ నెల 30వ తేదీ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ నాగరాజు పార్థివ్ లాంగ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మధుమేహం, పోస్ట్ లంచ్ బ్లడ్ షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను సైతం అందజేస్తారని తెలిపారు.

పదవీ విరమణ



జేఎన్‌టీయూలో పదవీ విరమణ పొందిన వారిని సత్కరించిన అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో శనివారం పలువురు ఉద్యోగులు పదవీవిరమణ చేశారు. యూనివర్సిటీలో సివిల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ జీకె విశ్వనాథం, ఎస్‌వీవీఎస్‌ఎస్ మూర్తి, వి. అశోక్ సూపరిటెండెంట్, టి.సుకుమార్ పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ డా. కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, కాలేజి ప్రిన్సిపాల్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రూ.1.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: పేదలకు సంక్షేమ ఫలాలను అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం ప్రాంతానికి చెందిన పూర్ణచందర్‌రాజు కుమార్తె అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శస్త్రచికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.5 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు లక్ష్మీపతి రాజు, సత్తిబాబు, గిరిబాబు, నరసింహ, వెంకటపతిరాజు, చిన్నబాబు తదితరులు ఉన్నారు. కాగా, పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు తరలి వచ్చి తాగునీటి పైపులైన్లు వేయాలని, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

శ్రీనిధి గ్లోబల్ స్కూల్లో ‘గ్రీన్ డే’



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులలో హరితహారంపై అవగాహన పెంచడంలో భాగంగా పద్మనగర్ శ్రీనిధి గ్లోబల్ స్కూల్లో వన మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటగా, ప్రతీ విద్యార్థి నాటిన మొక్కను సంరక్షణ తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. గ్రీన్ డే సెలబ్రేషన్స్ లో స్కూల్ చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వర రావు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, ప్రిన్సిపాల్ కోమలాదేవి, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

డి.శ్రీనివాస్‌కు ఘననివాళి

దుండిగల్: మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతి రాష్ట్రానికి తీరని లోటని భౌరంపేట్ ప్రణీత్ ప్రణవ్ బ్లూమ్స్ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి కేఎల్ బాబు అన్నారు. శనివారం అసోసియేషన్ సభ్యులు డి.శ్రీనివాస్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కుత్బుల్లాపూర్‌లో...

డి శ్రీనివాస్ మరణం తీరని లోటు అని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ అన్నారు. కొంపల్లిలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌కు ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కో ఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదారాబాద్ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.



అరవింద్‌ను పరామర్శిస్తున్న కేఎల్ బాబు తదితరులు

స్టార్టప్ కంపెనీలపై వర్క్‌షాపు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ ఆధ్వర్యంలో ‘స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపక ఔత్సాహికులకు విజయసూత్రాలు’ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథి జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ బుర్రా వెంకటేశం వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది విద్యావంతులున్న మన దేశంలో ఉద్యోగకల్పనకు స్టార్టప్ కంపెనీల ప్రాముఖ్యత ఎంతో ఉన్నదని, ఇటువంటి స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకులు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, వాటిని సాకారం చేసుకోవడానికి సరైన దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఇండియన్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డా. శ్రీనివాసరావు స్టార్టప్ కంపెనీల వ్యవస్థాపకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వర్‌రావు, రెక్టార్ ప్రొఫెసర్ కె. విజయకుమార్ రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ ఆర్ శ్రీదేవి పాల్గొన్నారు.



వర్క్‌షాపులో బుర్రా వెంకటేశం

బెలూన్స్ డే



బచ్‌పన్ ప్లే స్కూల్‌లో బెలూన్‌లతో సందడి చేస్తున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో శనివారం బెలూన్స్ డే నిర్వహించారు. వివిధ రంగుల బెలూన్‌లతో చిన్నారులు సందడి చేశారు. గాల్లో బెలూన్‌లను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పాఠశాల ఆవరణ అంతా వివిధ వర్ణాల బెలూన్‌లతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్వాల్ ట్రాఫిక్ సీఐగా నాగరాజు



ఏ.నాగరాజు, సీఐ అల్వాల్ ట్రాఫిక్

కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ సీఐగా ఎ.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ నాగేశ్వరరావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శంకరపల్లి, మోకిలా పోలీస్‌స్టేషన్ పరిధిలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న నాగరాజుకు అల్వాల్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు అప్పగిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టి సుచిత్ర నుంచి కొంపల్లి, గుండ్లపోచంపల్లి, దూలపల్లి ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నడపరాదని, లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనదారులు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

లెక్చరర్ ఉద్యోగ విరమణ



హైమవతిని జ్ఞాపికతో సత్కరించిన అధ్యాపక బృందం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు ఆర్.హైమవతి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్ విద్యాధికారి కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా హైమావతి కృషి చేశారని, ఆమె భావి జీవితం సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు రమేష్, ఐలయ్య, కవిత, పరశురాములు, వాసవి, సరిత తదితరులు పాల్గొన్నారు.